పేదింటికి పెళ్లి కానుక

- పక్కాగా 'వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా' అమలు
- మూడు ముళ్ల బంధానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక చేయూత
- గతంలో తూతూ మంత్రంగా చంద్రన్న పెళ్లి కానుక
- సాయాన్ని రెండింతలు చేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హర్షం

పెనుకొండ రూరల్: పెళ్లి చేసి చూడు... ఇల్లు కట్టి చూడు అంటారు పెద్దలు, ఎందుకంటే ఈ రెండు కార్యాలు చాలా ఖర్చుతో కూడుకున్నవి. పేదలు తమ ఆడపిల్లలను పెళ్లి చేసేందుకు అప్పులు చేసి వాటిని తీర్చలేక సతమతమవుతుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని పెళ్లి సమయంలో వారికి అండగా నిలబడేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెళ్లి కానుక (వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా) పథకాలను పకడ్బందీగా అమలు చేస్తుండటంతో ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా చంద్రన్న పెళ్లి కానుక

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రన్న పెళ్లి కానుక పేరుతో ప్రవేశపెట్టినా అరకొరగా అందిన సాయంతో ఆయా వర్గాల వారు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. తూతూ మంత్రంగా ఎస్సీలకు రూ.40 వేలు , ఎస్టీలకు రూ.50 వేలు, బీసీలకు రూ.35 వేలు మాత్రానికే పరిమితం చేశారు.

రెండింతలు పెరిగిన సాయం

టీడీపీ ప్రభుత్వ హయాంలో తూతూ మంత్రంగా చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని అమలు చేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెళ్లి కానుక పేరుతో రెండింతలు సాయం చేస్తున్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా డబ్బు విడుదల చేస్తుండటంతో ఆయా వర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సాయం రూ.వేల నుంచి రూ.లక్ష దాటడంతో పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసానిస్తోంది.

పెరిగిన ప్రోత్సాహం

కులం/వర్గం	టీడీపీ ప్రభుత్వంలో	ప్రస్తుత ప్రభుత్వంలో
ఎస్సీ	రూ.40 వేలు	రూ.లక్ష
ఎస్టీ	రూ.50 వేలు	రూ.లక్ష
బీసీ	రూ.35 వేలు	రూ.50 వేలు
మైనార్టీ	రూ.50 వేలు	రూ.లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	రూ.75 వేలు	రూ.1.2లక్షలు
ఎస్టీ కులాంతర వివాహం	రూ.75 వేలు	రూ.1.20 లక్షలు
బీసీ కులాంతర వివాహం	రూ.50 వేలు	రూ.75 వేలు
దివ్యాంగులు	రూ.లక్ష	రూ.1.5 లక్షలు
భవన నిర్మాణ కార్మికులు	రూ.20 వేలు	రూ.లక్ష



ఈ చిత్రంలో కనిపిస్తున్న పెళ్లి జంటకు గత ఏడాది సెప్టెంబర్‌లో వివాహం జరిగింది. ఇటీవల వైఎస్సార్ పెళ్లి కానుక డబ్బులు విడుదల చేయడంతో పెనుకొండ మండలం కురుబవాండ్లపల్లికి చెందిన వధువు లిఖిత బ్యాంకు ఖాతాకు రూ.50 వేలు డబ్బు జమైంది. ఎవరి సిఫారసు లేకుండాను నగదు జమ కావడంతో లిఖిత కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పెనుకొండ నియోజకవర్గంలో కల్యాణమస్తు అమలు ఇలా...

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన మొత్తం
2022-23	35	రూ.24,50,000
2023-24	273	రూ.1.83 కోట్లు
2024-25	19	రూ.12 లక్షలు

ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం



ఇటీవల నా కుమార్తె వివాహం జరిపించాము. పెళ్లి సమయంలో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాము. అయితే సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా కల్యాణమస్తు పథకం గురించి తెలుసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాము. కల్యాణమస్తు పథకం కింద రూ.లక్ష మంజూరైనట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. కల్యాణమస్తు పథకం ద్వారా మా లాంటి ఆడబిడ్డల తల్లిదండ్రులను ప్రభుత్వం ఆదుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. అడగ కుండానే అన్ని పథకాలు ఇస్తున్న వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకొంటున్నాము.

– లక్ష్మీదేవిబాయి, శెట్టిపల్లి, పెనుకొండ మండలం

మా ఇంటికి పెద్ద కొడుకు జగనే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మా ఇంటికి పెద్ద కొడుకులా అన్ని విధాలా అండగా నిలబడుతున్నారు. ఇటీవలే నా కుమార్తె వివాహం జరిపించాము. పెళ్లి సమయంలో ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యాము. కల్యాణమస్తు పథకం కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులు వచ్చి రూ. లక్ష మంజూరైనట్లు చెప్పడంతో చాలా ఆనందంగా ఉంది. సంక్షేమ పథకాలతో పేదలందరినీ ఆదుకుంటున్న జగన్‌కే మా మద్దతు.

– గంగ రత్నమ్మ, శెట్టిపల్లి, పెనుకొండ మండలం

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత 'రావుడి రాయల్స్'



ట్రోఫీతో ఆలూడి రావుడి రాయల్స్ జట్టు

అగళి: మండల కేంద్రంలో నిర్వహించిన అగళి ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఆలూడి రావుడి రాయల్స్ జట్టు నిలిచింది. రావూడి రాయల్స్ – ఉల్లేకెర భజరంగి వారియర్స్ మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన రావుడి రాయల్స్ జట్టు 8 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసి విజయం సాధించింది. రోళ్ల జెడ్పీటీసీ అనంతరాజు ముఖ్యఅతిథిగా హాజరై రావుడి రాయల్స్ జట్టుకు కప్ , రూ.30 వేల నగదు బహుమతులను అందజేశారు. రన్నర్స్‌కుతో కప్‌తో పాటు రూ.15 వేల నగదును అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి కుమార్, కోడిపల్లి కామరాజు,తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: రామాలయం నిర్మాణానికి హిందూపురం వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మనోజ్ జూలియట్ (మింటూ) రూ.50 వేలు విరాళం అందజేశారు. పరిగి సమీపంలో శ్రీరంగరాజులుపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామలయానికి ఆదివారం రూ.50 వేలు అందజేశారు. ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నారాయణస్వామి, నంజుండప్ప, నారాయణలతో పాటు లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, జీసీ శ్రీధర్, ఆనంద్, నాగార్జున, శేషు, శాంతరాజ్, సుమన్, శ్యామ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నాగేపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని కోడిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న నాగేపల్లి గ్రామంలో పంచాయతీ నిధులతో గ్రామ సర్పంచ్ మంజునాథ్ సీసీ రోడ్డు నిర్మాణాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలు రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రజల అభ్యర్థన మేరకు పంచాయతీ నిధులు రూ. 5.50 లక్షలతో నిర్మాణం చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తికి గాయాలు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతిలో సిద్ధేశ్వరస్వామి అగ్నిగుండ మహోత్సవంలో భాగంగా స్వామి వారిని పూజించే అర్చకులు ఆదివారం సాయంత్రం అగ్నిగుండలో అగ్నిపై నడిచే ఆచారం ఉంది. ఇందులో భాగంగా ఆదివారం అగ్నిగుండంలో నడుస్తుండగా యంజేరప్ప అనే అర్చకుడు కాలు జారి కింద పడ్డాడు. తీవ్రగాయాలు కాగా వెంటనే 108 వాహనంలో అనంతరం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అగ్ని ప్రమాదంలో దుంగల దగ్ధం



దగ్ధమైన దుంగలు

పావగడ: పట్టణంలోని చళ్లకెరె క్రాస్‌లో ఉన్న బాలాజీ రంపపు మిల్లులో ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువైన కలప దుంగలు దగ్ధమైనట్లు మిల్ నిర్వాహకుడు బాషా ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లును లీజ్‌కు తీసుకుని నడుపుతున్నానని, అమ్మకానికి సిద్ధంగా ఉన్న కలప పరికరాలు సైతం దగ్ధమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పివేశారు. సుమారు 5 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాషా తెలిపారు. స్థానిక పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసుకున్నారు.

నేడు మంత్రి పర్యటన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ సోమవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక లక్ష్మీవెంకటేశ్వర కల్యాణ మంటపంలో పార్టీ శ్రేణులతో సమావేశం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళలు చైతన్యవంతులు కావాలి

పెనుకొండ: మహిళా సాధికారతే దేశ భవిష్యత్తుకు పునాదని ప్రముఖ కవి, డాక్టర్ పసునూరి రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జాబిలి బాండ్‌బాషా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా జాతీయ కవి సమ్మేళనం సుమన జయంతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత పసునూరి రవీంద్ర మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు చైతన్యవంతులు కావాలని, మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, దౌర్జన్యాలు, దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. మహిళలు విద్యావంతులు అయినప్పుడే అభివృద్ధి సాధకులుగా నిలుస్తారన్నారు. సుబ్రహ్మణ్య శర్మ, రఘువీర్ ప్రతాప్, పుష్పలత, ముద్దరంగప్ప, శివలింగప్ప పాల్గొన్నారు.

ఆరు టిప్పర్ల సీజ్



మట్టి తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేస్తున్న పోలీసులు

పెనుకొండ రూరల్: అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసినట్లు కియా ఎస్‌ఐ రంగడు తెలిపారు. ఎర్రమంచి పంచాయతీ పరిధిలోని హంద్రీనీవా కాలువ పక్కన ఉన్న గుట్ట ప్రాంతంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు టిప్పర్లను ఆదివారం పట్టుకున్నామన్నారు. వాటిని సీజ్ చేసి మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు.

నీటి సమస్య పరిష్కారం

చిలమత్తూరు: మండలంలోని దిగువపల్లితండా పంచాయతీలోని అంజనీతండాలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఎన్నిమార్లు బోరుబావులు వేసినా నీరు పడకపోవడంతో నీటి సమస్య తీవ్రమైంది. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎస్ దీపిక సూచన మేరకు ఆదివారం సర్పంచ్ నీలిబాయి పంచాయతీ నిధులు వెచ్చించి బోరుబావి వేయడంతో నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో తాగునీటి సమస్య తీరిపోయిందని గ్రామస్తులు సమన్వయకర్తకు, సర్పంచ్‌కు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబేనాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమాభివృద్ధే జగనన్న ధ్యేయం





వెంకటాంపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఉషశ్రీచరణ్ , పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలుకుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

- మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ/పెనుకొండ రూరల్: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమశాఖామంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉషశ్రీచరణ్ అన్నారు. ఆదివారం నగర పంచాయతీ పరిధిలోని 3వ వార్డు వెంకటరెడ్డిపల్లి, పట్టణంలోని 10వ వార్డులోని శ్రీరాములయ్యకాలనీ, వెంకటాపురం తండా, పరమేశ్వరపురంలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. మరోసారి జగనన్న ముఖ్యమంత్రి అయితే పేదలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. పేదలకు ఇబ్బంది పడకూడదనే రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు ఎన్ని ఉన్నా ఇచ్చిన మాటకు కట్టుబడి సమయానికి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే డబ్బు జమ చేస్తున్నారన్నారు. సంక్షేమ సారథికి అండగా నిలవకపోతే అబద్ధాల టీడీపీ వచ్చి పేదలను కష్టాల్లోకి నెట్టేస్తుందన్నారు. గతంలో చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని, మరోసారి ఆయనకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలకు పాతర వేస్తారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్ బోయ సునీల్, కన్వీనర్ బోయ నరసింహ, కౌన్సిలర్లు బోయ హారతి, సుధాకరరెడ్డి, తయూబ్, సద్దాం, రఘునాథరెడ్డి, కొండలరాయుడు, గుట్టూరు ఆంజనేయులు, శేషాద్రి, శ్రీరాములు, కోఆప్షన్ మెంబర్ నేమతుల్లా, ముహీబా, ఫరీద్, గణేష్, యాసిన్, నాయుడు, శంకరరెడ్డి, బోయ బాబు, వెంకటేష్, టీసీ శ్రీనివాసరెడ్డి, టి.శ్రీనివాసులు, గోవింద, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

పెనుకొండ రూరల్: మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో పలువురు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం వెంకటరెడ్డిపల్లిలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ... 24 ఏళ్లగా టీడీపీ కోసం కష్టపడి పనిచేస్తున్నా సరైన గుర్తింపు లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో అశ్వర్థ, గొల్ల కిష్టప్ప, లక్ష్మీరెడ్డి, వెంకటేష్, చిన్నరామప్ప, అంబూజ, చిన్నరామప్ప, గోపి, విజయ్, నారాయణప్ప, మంగళ రామాంజి, దలవాయి మంజు, శీనప్ప, తదితరులున్నారు.

'పురం'లో ఉచిత వైద్యశిబిరం

హిందూపురం: ఆరోగ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదని వైద్యులు అన్నారు. ఆదివారం ముక్కిడిపేటలోని రినాన్స్ పాఠశాలలో బెంగళూరు సప్తగిరి ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గుండె, న్యూరోసర్జరీ, కిడ్నీ స్టోన్స్, క్యాన్సర్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 240 మందికి పరీక్షలు నిర్వహించి 14 మందికి ఆపరేషన్లు చేయించడానికి ఎంపిక చేసి బెంగళూరుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూఎఫ్ అధ్యక్షులు ఉమర్‌ఫరూక్, ఉబేదుల్లా, డాక్టర్ సల్మాన్ అలాఖాన్, సర్ఫరాజ్, సాధిక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

హిందూపురం అర్బన్: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లికి చెందిన డి.లోకేష్ (38) మండలంలోని తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఉన్న గార్మెంట్ పరిశ్రమ సమీపంలో ఓ బంకు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్‌ఐ బాలరాజు తెలిపిన వివరాలమేరకు.... లోకేష్ తమిళనాడులోని సేలం చెందినవాడన్నారు. నాలుగేళ్ల క్రితం ముద్దిరెడ్డిపల్లికి వచ్చి ఇక్కడే పట్టుదారాలకు రంగుల అద్దకం చేస్తూ జీవనం సాగించేవాడన్నారు. లోకేష్‌కు నాలుగేళ్ల క్రితమే వివాహం కాగా.. రెండేళ్ల క్రితం భార్య వదిలేయడంతో తమ్ముడు గుణశేఖర్, తల్లి ఉంటున్న ఇంట్లో ఉంటూ మద్యానికి బానిసైనట్లు చెప్పారు. వారంలో రెండు మూడు రోజులకోసారి ఇంటికెళ్లేవాడన్నారు. ఇదే క్రమంలో శనివారం సాయంత్రం గౌరిబిదనూరులోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి తూమకుంటలో దిగి ఉరివేసుకొని చనిపోయాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు.

నూతన కమిటీ ఎంపిక



నూతనంగా ఎన్నికైన అహలే సున్నతుల్ జమాత్ సభ్యులు

హిందూపురం టౌన్: అహలే సున్నతుల్ జమాత్ పట్టణ నూతన కమిటీని పట్టణ సమీపంలో ఉన్న పిర్ భక్తర్ వలి దర్గాలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడిగా సదర్ చౌక్ పెనుకొండ దర్గా పీఠాధిపతి తాజ్ బాబా, హిందూపురం హలేస్ ఉన్నతుల్ జామ కమిటీ అధ్యక్షుడిగా మహబూబ్ దోలా, ఉపాధ్యక్షులుగా రఫిక్, ఇద్రిస్ సాబ్ ఎంపిక చేశారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రెహమాన్, సహాయ కార్యదర్శిగా షేక్ అజ్మతుల్లా, ట్రెజరర్‌గా షబ్బీర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా హబీబ్ సాబ్, ఇస్మాయిల్, బాషా, డాక్టర్ జిలాన్, షేక్ ఆసిఫ్, బాబు, మొహమ్మద్, ముక్తియర్, యూసుఫ్‌తో గౌరవ సలహాదారులుగా ఉమర్ ఫరూఖ్ ఖాన్, అక్బర్ సాబ్, సలహాదారులుగా ఇదాయతుల్లా ఖాన్, టి.ఎండి.ఇందాద్, రకీబుల్ రెహమాన్, అతిక్ అహ్మద్‌తో పాటు మరి కొందరిని సభ్యులుగా ఎంపిక చేశారు.



అగ్నిగుండం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న భక్తులు



భక్తులకు పానకం పోస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తలు శాంతమ్మ, ఈరలక్కప్ప

పోటెత్తిన భక్తజనం

అమరాపురం: మండలంలోని హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ హేమావతిలో రద్దీ తగ్గలేదు. సిద్ధేశ్వర స్వామి అన్న దాసోహ కేంద్రం ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకూ అన్నదానం చేశారు. ఆలయం వద్ద వెలసిన గాజులు, బొమ్మల అంగళ్ల వద్ద సందడి నెలకొంది. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ, సర్పంచ్ తిప్పేస్వామి తాగునీటి వసతి కల్పించారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సీఐ రాజకుమార్ ఎస్‌ఐ.జనార్దననాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆనవాయితీ ప్రకారం కాల భైరవేశ్వరస్వామికి అరటి పండ్లను రాస్తున్న భక్తులు



సిద్ధేశ్వరస్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

పొదుపు ఏజెంట్ల కమిటీ ఎన్నిక

హిందూపురం టౌన్: జిల్లా జాతీయ పొదుపు ఏజెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందూపురం ఏజెంట్ల అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం స్థానిక విద్యానగర్‌లోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భీమి శెట్టి కృష్ణమూర్తి, కార్యదర్శి శ్రీనివాసులు సమక్షంలో నూతన కమిటీ ఎన్నిక జరగ్గా అధ్యక్షురాలిగా లీలాబాయి, కార్యదర్శిగా అమర్నాథ్, కోశాధికారిగా శ్రీరాములు ఎన్నికయ్యారు. అనంతరం నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో డివిజనల్ పీఎల్‌ఐ డీఓ నరసింహమూర్తి, పోస్టల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

చిలమత్తూరు: మండల సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి 44వ నంబరు జాతీయ రహదారి మంజునాథ దాబా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా అటుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం వారిని ఢీ కొంది. ముగ్గురు తీవ్రంగా గాయపడగా అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో చిక్కబళ్లాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. క్షతగ్రాతులు చిలమత్తూరు మండలంలోని మరవకొత్తపల్లి బీసీ కాలనీకి చెందిన వారిగా తెలుస్తోంది.

డెంగీతో ఉపాధ్యాయుడి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని పీసీ గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న శ్రీనివాసులు (56) డెంగీ జ్వరంతో ఆదివారం మృతి చెందారు. గత మూడు రోజులుగా డెంగీ జ్వరంతో ఆయన బాధపడుతున్నాడు. అయితే ఆదివారం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకొన్న తోటి ఉపాధ్యాయులు శ్రీనివాసులు మృతికి సంతాపం తెలిపారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

పావగడ: స్థానిక ఎస్ఎస్‌కే రంగ మందిరంలో ఆదివారం సేవాలాల్ 285వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్ మాట్లాడుతూ.. లంబాడీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, సాంస్కృతిక రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలబడాలన్నారు. అనంతరం లంబాడీల సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సరిగమ హనుమంతు, సింగర్ పుండలీక ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మాజీ జెడ్పీ సభ్యురాలు గాయత్రి బాయి, తాలూకా బీజేపీ మాజీ అధ్యక్షుడు రవిశంకర నాయక్, శంకరమూర్తి, అక్షర దాసోహ ఏడీ శంకర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి అర్హత పరీక్ష

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి గ్రామ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. 294 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్‌లో ప్రవేశానికి 125 మంది పరీక్ష రాశారని ప్రిన్సిపాల్ మైలారప్ప తెలిపారు.



